క్లుప్తంగా

జోడు లింగాలను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

కూడేరు: మండల కేంద్రంలోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి పుణ్య క్షేత్రాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సందర్శించారు. ఆలయ అర్చకుడు మహేష్‌స్వామి ఆయన సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేయించారు.

యువత సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న పాస్టర్ ఎజ్రా

కంబదూరు: యువత సన్మార్గంలో నడవాలని పాస్టర్లు ఎజ్రా, సువర్ణ రాజు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సీఆండ్‌ఐజీ మిషన్ చర్చిలో ఒక రోజు యవ్వనస్తుల సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో చాలా మంది యువత చెడు వ్యసనాలకు బానిసలై భవిష్యత్‌ను చేతులరా నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత భక్తి భావాన్ని అలవర్చుకొని ముందుకెళ్తే బంగారు భవిష్యత్‌ను లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాస్టర్ జేమ్స్, సంఘం పెద్దలు ప్రభాకర్, జోసఫ్‌రెడ్డి, జోయెల్, విల్సన్, జయరాజు, కుమార్, బాబు, వైఎస్సార్‌సీపీ నేత రవికుమార్ పాల్గొన్నారు.

పేదల ద్రోహి చంద్రబాబు



చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డి హీరేహాళ్(రాయదుర్గం): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పేదల పట్ల చులకనగా మాట్లాడి తన అంతరంగాన్ని మరోసారి బయటపెట్టారని రాయదుర్గం మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్ నాయక్, మండల కన్వీనర్ వన్నూర్‌స్వామి పేర్కొన్నారు. బుధవారం బళ్లారి–బెంగళూరు జాతీయ రహదారిపై డి హీరేహాళ్ మండలం ఓబుళాపురం చెక్‌పోస్టు వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఓబుళాపురం నుంచి చెక్‌పోస్టు వరకూ చంద్రబాబు దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి అంతర్రాష్ట్రీయ రహదారిపై దహనం చేశారు. ఇంటి స్థలాలను సమాధులతో పోల్చుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన బాబును రాష్ట్ర బహిష్కరణ చేయాలని డిమాండ్ చేశారు. పేదల ఇంటిస్థలాలపై చేసిన అవమానకర వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకుడు రహంతుల్లా, సర్పంచులు మల్లికార్జున, లక్ష్మి, వన్నూర్‌స్వామి, వైస్ ఎంపీపీ లింగప్ప, ఎంపీటీసీ ఎర్రిస్వామి, పార్టీ నాయకులు జగదీష్, తొండె వెంకటేశులు, గొల్ల సురేష్, మంజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగరాజు

కంబదూరు: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తలారి తిమ్మరాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఈసందర్భంగా సభ్యులు మండలంలోని చాలా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, అధికారులు పట్టించుకోవడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏఏ గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందో గుర్తించి పరిష్కరించాలని జెడ్పీటీసీ ఆదేశించారు. బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ బాబురెడ్డి అన్నారు. వైస్ ఎంపీపీ తిమ్మారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రాజన్న,ఎంపీడీఓ ఆంజనేయులు, సీడీపీఓ వనజ అక్కమ్మ, వైద్యాధికారి ఆసియా పాల్గొన్నారు.

ఆడపిల్లలను భారంగా చూడొద్దు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

కూడేరు: బాల్య వివాహాలు చేసి వారి జీవితాలను నాశనం చేయవద్దని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఆడ పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనపై బుధవారం కూడేరు ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సదస్సును నిర్వహించారు. పీడీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పేదరికం , ఇతర ఇబ్బందులతో తల్లిదండ్రులు ఆడ పిల్లలను భారంగా చూడొద్దన్నారు. బాల్య వివాహాల నిర్మూలనను అందరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపు నిచ్చారు. ఎంపీడీఓ ఎంకే బాషా, సీడీపీఓ ధనలక్ష్మీ, సీహెచ్‌ఓ మోహన్ బాబు, పీఆర్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల వర్తింపు

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



పింజిరి కొట్టాలలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



కల్లుదేవనహళ్లిలో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు

కళ్యాణదుర్గం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని పింజిరి కొట్టాల, కదదరకుంట, తిమ్మసముద్రంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాల వారీగా పొందిన ఉపయోగంపై అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థతో పేద ప్రజల ముంగిటకే పథకాలను అందిస్తోందన్నారు. గత టీడీపీ హయాంలో కేవలం జన్మభూమి కమిటీ సభ్యులకు మాత్రమే పథకాలను అందించారని చెప్పారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నామని చెప్పారు. ప్రతి ఇంట్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించి, ఆర్థిక భరోసా కల్పిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, సచివాలయాల కన్వీనర్ భట్టువానిపల్లి అంజి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామ్మోహన్, సర్పంచులు సోమశేఖర్, బాపూజీ, నగేష్ నాయక్, ఎంపీటీసీ ధనుంజయ, నాయకులు భాస్కర్‌రెడ్డి, శివలింగారెడ్డి, మారెప్ప, మాధవయ్య, బి.మారెప్ప, వెంకటేశప్ప, నాగరాజు, శీనప్ప, వలి, మల్లేశు, జిలాన్, సర్దార్, ఇమాంవలి, నిజాంవలి, రవూఫ్, గోపాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పండి

రాయదుర్గం రూరల్: మాయలమరాఠి, అబద్ధాల పుట్ట, అధికారం కోసం ఎంతటి నీచానికైనా ఒడిగట్టే మోసకారి చంద్రబాబుకు ఓటు అనే ఆయుధంతోనే బుద్ధి చెప్పాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని వేపరాల గ్రామంలో పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, వీరశైవ లింగాయత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర గౌడ్‌తో కలిసి బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల వసూళ్ల పర్వం , దోపిడీ గురించి వివరించారు. అలాంటి పార్టీకి ఓట్లు వేస్తే ప్రజలే తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. చార్ సౌ బీస్ చంద్రబాబుకు అధికార దాహంతో ఎన్నికల ముందు నోటికొచ్చిన వాగ్దానాలు చేయడం పరిపాటి అన్నారు. గద్దెనెక్కాక హామీలు తుంగలో తొక్కి, ప్రజలను వంచించడమే ఆయన పరమావధి అన్నారు. పిల్లినిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి పార్టీని, ముఖ్యమంత్రి సీటును లాక్కున్నారన ఎద్దేవా చేశారు. ఆ తరువాత 2014లో లేనిపోని హామీలిచ్చి మోసం చేశారని మండిపడ్డారు. రాయదుర్గంలో మాజీ మంత్రి, మేకప్ సుందరాంగుడు కాలవ శ్రీనివాసులు కూడా బాబును మించిన దొంగ అన్నారు. ప్రకృతి సంపదను విచ్చల విడిగా దోచుకుని దాచుకున్నారని దుయ్యబట్టారు. ఏనాడు ప్రజా సంక్షేమం పట్టని కాలవ ఏదో పొడిచేశాను అంటూ.. ఉత్తుత్తి కాగితాలతో అన్ని కులాల వారిని మోసగించారని తెలిపారు. ఆరంభ శూరత్వంతో ప్రారంభించిన పనులకు బిల్లులు రాక అర్ధాంతరంగా ఆగిపోయి దిష్టిబొమ్మల్లా మిగిలిపోయాయన్నారు. అర్ధాంతరంగా ఆగిన పనులకు మేము బిల్లులు చేయిస్తే.. ఇప్పుడేమో ఆ పనుల వద్ద ఫోటోలు దిగుతూ సెల్ఫీ సుందరాంగుడయ్యారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ మరొక్కసారి ముఖ్యమంత్రిగా చేసుకుని సంక్షేమానికి మీరే బాటలు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు దిలావర్ బాషా, నాయకులు శివారెడ్డి, కెంచానపల్లి బుజ్జి, మురహరి, మలకాపురం నాగరాజు, గోపాల, కాశీపురం తిప్పేస్వామి, తిమ్మప్ప, యు.నాగేంద్ర, స్టోర్ డీలర్ వెంకటస్వామి యు.లింగారెడ్డి, గంగన్న, నాగరాజు, మాజీ సర్పంచ్ శంకర్, రామన్న, మారెన్న, ఎంపీడీఓ కొండయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి భీమేష్ , వెలుగు సీసీ రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

బొమ్మనహాళ్: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని కల్లుదేవనహాళ్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాపు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లలో ప్రభుత్వం పథకాల రూపంలో ప్రతి ఇంటికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు విప్ దృష్టికి తెచ్చిన సమస్యలను సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరం చూపారు. చిన్న చిన్న సమస్యలను సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. పరిధికి మించి సమస్య ఉంటే తన దృష్టికి తేవాలని విప్ కాపు ఆదేశించారు. ప్రభుత్వం పారదర్శకంగా పథకాలు అందిస్తున్నందున అర్హులైన వారంతా పథకాలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్ వన్నూరు స్వామి, నాయకులు వెంకటాక్షిపతిరెడ్డి, వన్నల్లి రామాంజినేయులు, రామకృష్ణ, మనోహర్‌శెట్టి, మాబుసాబ్, కోటేశ్వరరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, వన్నూరుస్వామి, ఆనంద్, రామాంజి, బడిగే వన్నూరుస్వామి, వీరన్నగౌడ్, ముక్కన్న, పరమేశ్వర, గాధిలింగ, డాక్టర్ బసప్ప, సూర్యప్రతాప్‌రెడ్డి, దివాకర్, జి. నాయుడు, సుధాకర్, తిప్పేస్వామి, దేవేంద్ర, రమేష్, దర్గన్న, శీన, చిదానంద, బసవరాజు, నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్

రాయదుర్గం రూరల్: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, డిప్యూటీ కలెక్టర్ వరప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గృహ నిర్మాణాలు , నాడు–నేడు ద్వారా చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రుల నిర్మాణం, అలాగే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. జూన్ నెల నుంచి చౌకధాన్యపు డిపోల్లో రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం రాగుల పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ విధివిధానాల ప్రకారం ఎలాంటి అవకతవకలు లేకుండా లబ్ధిదారులకు అందించేలా తహసీల్దార్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారులు పంచాయతీ రాజ్ డీఈ రామ్మోహన్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ రవిశంకర్ రెడ్డి, తహసీల్దార్ మారుతి, ఎంఈఓ నాగమణి, మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కురుబ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా లోకేష్

ఉరవకొండ: కురుబ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా కూడేరు మండలం అరవకూరుకు చెందిన అంకాల లోకేష్ నియమితులయ్యారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర కురుబ యువజన సంఘం అధ్యక్షుడు వశికేరి రమేష్ చేతుల మీదుగా రాష్ట్ర కార్యదర్శి అంకాల లోకేష్ నియమాకపత్రం అందుకున్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

కళ్యాణదుర్గం: సమష్టి కృషితో బాల్య వివాహాలను అరికడదామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. చదివిద్దాం...చదివిద్దాం ...అమ్మాయిని చదివిద్దాం', 'చిన్న పిల్లల జీవితాలతో చెలగాటం... ఈ బాల్య వివాహం....', 'ఆడపిల్ల చదువు ఆవనికి వెలుగు' అంటూ ప్లకార్డులతో పట్టుకుని అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా పోలీసులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. మంత్రి మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం– 2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న అమ్మాయికి, 21 సంవత్సరాల లోపు ఉన్న అబ్బాయికి వివాహం చేయకూడదన్నారు. బాల్య వివాహం చేస్తే వరుడికి, వారి తల్లిదండ్రులకు పెళ్లిలో పాల్గొన్న వారికి, సహకరించిన వారందరికీ 2 సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందన్నారు. అనంతరం ఆడపిల్లల సంరక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, డీఎస్పీ బి.శ్రీనివాసులు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎల్‌డీఓ శంకర్, కమిషనర్ వెంకటేశులు, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీడీఓ బాలాజీ, కౌన్సిలర్ అర్చన, ఎంపీపీ మారుతమ్మ, నాయకులు సుధీర్, రామచంద్ర, బ్రహ్మయ్య, భట్టువానిపల్లి అంజి, బిక్కి నాగలక్ష్మి, హేమ, అప్జల్ తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై మండలంలోని వివిధ శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దారు బ్రహ్మయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ల నారాయణరెడ్డికి ఘన నివాళి





రాకెట్ల నారాయణరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, ప్రణయ్, వైఎస్సార్‌సీపీ నేతలు మధు, నిఖిల్

ఉరవకొండ: పోరాటాల యోధుడు, రైతు పక్షపాతి రాకెట్ల నారాయణరెడ్డి 28వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి స్వగృహంలో తన తండ్రి రాకెట్ల నారాయణరెడ్డి, సోదరుడు వై.రవీంద్రనాథ్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి మాజీ ఎమ్మెల్యే విశ్వ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ నిరుపేదలకు అండగా నిలిచిన రాకెట్ల నారాయణరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి పోరాటాలు వృథా కావని, కలకాలం వారు పేదల గుండెల్లో ఉంటారన్నారు. మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలోని పోరాటయోధులు నారాయణరెడ్డి, రవీంద్రరెడ్డి ఘాట్ వద్ద మాజీ ఎమ్మెల్యే విశ్వ కుటుంబ సభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి, యువనేత వై.నిఖిల్‌నాథ్‌రెడ్డి, వై.అవినాష్‌రెడ్డి కుటుంబ సభ్యులు నివాళులర్పించారు.

వలంటీర్ల సేవలు దేశానికే ఆదర్శం



వలంటీర్లను సత్కరించిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: వలంటీర్ల సేవలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భవాని అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అర్హులకు పథకాలు అందుతున్నాయన్నారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా అత్యంత జవాబుదారితనంతో పథకాలను ఇంటివద్దకు అందిస్తున్న వలంటీర్ల సేవలు అమోఘమన్నారు. కరోనా విపత్కరపరిస్థితుల్లో వలంటీర్లు అందించిన సేవలు అద్భుతమన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యుల పెత్తనంతో పథకాలు అందలేదన్నారు. 44 ఏళ్లరాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు వయస్సు తగ్గట్టుగా ప్రవర్తించడం లేదన్నారు. టీడీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని విమర్శించారు. రాబోవు కాలంలో టీడీపీ కనుమరుగవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాం మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీడీఓ శ్రీనివాసులు,తహసీల్దార్ వేణుగోపాల్, మండల కన్వీనర్ మంజునాథ,జిల్లా వైఎస్సార్సీపీ గ్రీవెన్ సెల్ అధ్యక్షుడు కాంతారెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవింద, కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ జయమ్మ, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా చెక్కుల పంపిణీ

రాయదుర్గం రూరల్: వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి బుధవారం వైఎస్సార్ బీమా ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మలకాపురం గ్రామం వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గొల్ల మంజునాథ కుటుంబానికి రూ.5 లక్షలు, అలాగే రేకులకుంటలో తిప్పేస్వామి భార్య మహదేవి, వన్నూరప్ప భార్య జయమ్మ, మల్లికార్జున భార్య ధనలక్ష్మి కుటుంబాలకు రూ. లక్ష చొప్పున వైఎస్సార్ బీమా చెక్కులను అందజేశారు. అలాగే కొండాపురం సహకార సొసైటీ బ్యాంకులో పంట రుణాల రెన్యూవల్ సమయంలో ప్రమాద బీమా చెల్లించిన రైతు కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున చెక్కులు మంజూరయ్యాయి. అందులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాశీపురం గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ సత్యనారాయణ నాయుడు కుటుంబానికి , వేపరాల క్రాస్‌కు చెందిన కావలి బసప్ప భార్య మంజులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, ఎంపీపీ విద్యావతి, కో–ఆప్షన్ సభ్యులు దిలావర్ బాషా, ఎంపీటీసీ మఠం సురేష్, శివారెడ్డి, దేవరాజ్, లక్ష్మణ్ణ, కొండాపురం సొసైటీ సీఈఓ రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు భీమేష్, అశోక్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బాబు, కాశీపురం తిమ్మప్ప, తిప్పేస్వామి, జుంజురాంపల్లి మఠం మంజునాథ, హనుమంతరాయుడు, రుద్రముని, కొల్లప్ప, కెంచానపల్లి బుజ్జి, మురహరి, మాజీ వైస్ ఎంపీపీ జలంధర్ నాయుడు, మలకాపురం గోపాల్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో గురువారం ఉదయం 6 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంల నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల కన్వీనర్ కె.ఈశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అతిథిగా హాజరవుతారన్నారు.

ఆర్థిక సమస్యలతో రైతు ఆత్మహత్య

బెళుగుప్ప: మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన జెట్టి ప్రకాశ్ (65) బుధవారం ఇంట్లోనే విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత రైతు కుమారుడు హరికృష్ణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. తమకు గంగవరం, గోళ్ల గ్రామాల పరిధిలో 54 ఎకరాల పొలం ఉందని, ఈ మొత్తం పొలంలో వ్యవసాయ సాగుకు కొన్నేళ్లుగా రూ.29 లక్షల వరకు అప్పులు చేసినట్లు తెలిపారు. ఆర్థిక సమస్యలతో తన తండ్రి ప్రకాష్ సమతమయ్యారని, ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణయ్య తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం

వజ్రకరూరు: మండల కేంద్రమైన వజ్రకరూరులో గురువారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ వై.ప్రణయ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులు హాజరవుతారన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఉరవకొండ: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సంఘం అధ్యక్షుడు ఇంద్రావతి సురేంద్ర కోరారు. మంగళవారం ఉరవకొండ దేవాంగ ఫంక్షన్‌హాల్లో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశానికి హజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజుకు వాల్మీకి సంఘం నేతలు వినతి పత్రం అందించారు. వాల్మీకి సంఘం నేతలు నాగరాజు, ఎర్రిస్వామి, ధనంజయ, సురేష్ ఉన్నారు.

శుభకార్యం

కూడేరు: కమ్మూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత పెద్దన్న కుమారుడు లోకేష్ వివాహం బుధవారం చంద్రకళతో కూడేరులో ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, కమ్మూరు సర్పంచ్ రంగారెడ్డి, ఆ పార్టీ నేతలు సంగప్ప, వన్నూరప్పలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

గుమ్మఘట్ట: ఉపాధి హామీలో మండల వ్యాప్తంగా జరిగిన 749 పనులపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. గ్రామసభల్లో ప్రజలు పాల్గొనాలన్నారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

రాయదుర్గం: డి హీరేహాళ్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో బుధవారం ఉదయం 10 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పవిత్ర తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలు

ఉరవకొండ: మండల పరిధిలోని మూస్టూరు పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సివిల్ కోర్సుల్లో నేటి నుంచి ప్రవేశాలు ఉంటాయని కళాశాల ప్రిన్సిపాల్ అశ్రాఫ్‌అలీ తెలిపారు. జూన్ 1వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు సెల్: 8074425979ను సంప్రదించాలన్నారు.

హౌసింగ్ ఏఈపై చర్యలు తీసుకోండి

విడపనకల్లు: మండల హౌసింగ్ ఏఈ అనీల్‌కుమార్ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని, ఏఈపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు కెంగూరి ఎర్రిస్వామి, ఉరవకొండ తాలూకా అధ్యక్షుడు సింగాడి వీరప్ప, లబ్ధిదారులు జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ కేశవనాయుడి కోరారు. బుధవారం హౌసింగ్ పీడీ మండల పర్యటకు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఇల్లు కట్టుకుంటున్న లబ్ధిదారులతో అనీల్‌కుమార్ డబ్బు వసూలు చేస్తున్నారని, ఇవ్వకపోతే వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

నారాయణ పాఠశాలను సీజ్ చేయాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని నారాయణ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ పేర్కొన్నారు. ఇప్పటికే దాదాపు 300లకు పైగా అడ్మిషన్లు చేసుకున్నారని, కళాశాలను అధికారులు సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

వైద్యాధికారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

వజ్రకరూరు: మండలం గడేహోతూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిపై గ్రామ సచివాలయ కన్వీనర్ కె.పార్వతి జిల్లా కలెక్టర్ గౌతమి, డీఎంఅండ్‌హెచ్‌ఓకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. సమయ పాలన పాటించడంలేదని, రోగులకు సరైన వైద్యం అందించడం లేదని ఆరోపించారు. విచారించి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు గ్రామ సచివాలయ కన్వీనర్ కె.పార్వతి తెలిపారు.

చిరు వ్యాపారిపై బ్లేడ్‌తో దాడి

వజ్రకరూరు: మండల కేంద్రం సమీపంలో బుధవారం సాయంత్రం ఓ చిరు వ్యాపారిపై నలుగురు దుండగులు బ్లేడ్‌తో దాడి చేసి, రూ.5వేలు నగదు, సెల్‌ఫోన్ అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తిలోని దాసరి కాలనీకి చెందిన లక్ష్మీనారాయణ... బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై కుర్చీలు వేసుకుని వజ్రకరూరులో విక్రయించేందుకు వచ్చాడు. సాయంత్రం వ్యాపారం ముగించుకుని గుత్తికి తిరుగు ప్రయాణం కాగా, వజ్రకరూరు దాటిన తర్వాత ద్విచక్రవాహనాల్లో అనుసరిస్తూ వచ్చిన నలుగురు వ్యక్తులు లక్ష్మీనారాయణను ఆపి, బ్లేడ్‌తో దాడి చేసి, నగదు, సెల్‌ఫోన్ లాక్కెళ్లారు. అటుగా వెళుతున్న వారు గమనించి 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రుడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భవిష్యత్ తరాలకు మేలుచేయడమే లక్ష్యం

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



కొనకొండ్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: భవిష్యత్ తరాలకు మేలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొనకొండ్లలోని ఛాయాపురం రహదారిలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు రూ.కోటి 25 లక్షలతో నూతన విద్యుత్ ఉపకేంద్రం (సబ్‌స్టేషన్) నిర్మాణానికి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మాట్లాడుతూ కొనకొండ్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తుండటంతో లోఓల్టేజీ సమస్యకు చెక్ పడినట్లేనన్నారు. నియోజకవర్గంలోని గడేకల్లు, చోళసముద్రం గ్రామాలకు ఇప్పటికే విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరయ్యాయని, రామసాగరం, కొకుంట్ల, పీసీ ప్యాపిలి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. గత టీడీపీ పాలనలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం నెలలతరబడి రైతులు ఎదురు చూడాల్సి వచ్చేదని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని వెల్లడించారు. సీఎం జగన్ రైతు సంక్షేమం కోసం రూ.కోట్లు ఖర్చు పెడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచు సంచర్ల ఇందిరమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్ర, ఎంపీటీసీలు పాపన్న, ముద్దయ్య, ఓసీ విభాగం నాయకుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవ నాగలింగేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని దాసప్ప రోడ్డు గొంచికారి లేఅవుట్‌లో వెలసిన పురాతన బసవనాగలింగేశ్వర, సుబ్రహ్మణ్య స్వామి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. నూతన విగ్రహాలు, ధ్వజస్తంభం, గోపుర కలశస్థాపన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కాపు భారతి దంపతులు, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి మాధవరెడ్డి, కౌన్సిలర్ శ్రీలక్ష్మి పాల్గొని పూజలు మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, జ్ఞాన విమాన గోపుర కలశ ప్రతిష్ఠ, పార్వతి, గణపతి, కార్తికేయ, నవగ్రహాది దేవతులు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ కళాహోమం, కుష్మాండలి, మహాపూర్ణాహుతి, జ్వాలా దర్శనం, ధేను దర్పణ దర్శనం నిర్వహించారు. కార్యక్రమంలో రాజవిద్యాశ్రమ పీఠాధిపతులు వాసుదేవానంద సరస్వతి స్వామిజీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు రామానాథం, గౌరవాధ్యక్షుడు తాయి శ్రీనివాసులు పాల్గొన్నారు.